వాహనదారులు జాగ్రత్తగా వెళ్లాలి

- తక్కువ వేగంతో, ఖచ్చితమైన దూరం పాటించాలి
- రంగారావు, రీజనల్ ట్రాన్స్‌పోర్టు ఆఫీసర్, పెద్దపల్లి





సాక్షి, పెద్దపల్లి: చలికాలంలో రాత్రి సమయంలో, వేకువజామున వాహనాలు జాగ్రత్తగా నడపాలి. ఎదురుగా వచ్చేవారికి స్పష్టంగా కనిపించేలా లైట్లను ఆన్‌చేసి ఉంచాలి. లోబీ మ్ ఫాగ్‌లైట్లు ఉండేలా చూసుకోవాలి. తక్కు వ వేగంతో వెళ్లాలి. వాహనాల మధ్య ఖచ్చితమైన దూరం పాటించాలి. విండ్ స్క్రీన్, సైడ్ మిర్రర్లపై ఎప్పటికప్పుడు మంచును శుభ్రం చేయాలి. కారు, ఇతర పెద్ద వాహనాల్లో అద్దంపై మంచు పొర కమ్మకోకుండా డీఫ్రాస్టర్ వినియోగించాలి. రోడ్లు స్పష్టంగా కనిపించకపోతే సురక్షితమైన స్థలంలో వాహనం నిలిపివేయడం మంచిది. అది ఇతర వాహనాలకు కనిపించే విధంగా ఉండాలి. పొగమంచు దృష్ట్యా రాత్రి 10.30నుంచి ఉదయం 7వరకు దూర ప్రయాణాలు తాత్కాలికంగా వాయిదా వేసుకోవాలి. కుటుంబాలతో ఇతర ప్రాంతాలకు వెళ్లేవారు రాత్రి ప్రయాణం చేయొద్దు. పెద్దవాహనాలు, ట్రక్కులు రోడ్డు పక్కన నిలపకూడదు. సరైన జాగ్రత్తలు పాటించి, క్షేమంగా గమ్యాన్ని చేరుకోవాలి.

బహిరంగ ప్రదేశాల్లో ఉంచొద్దు

- ఓవర్ కూల్ అయి బ్యాటరీ డ్రెయిన్ అవుతుంది
- దినేశ్, మొబైల్ టెక్నీషియన్, పెద్దపల్లి



సాక్షి, పెద్దపల్లి: కొద్దిరోజులుగా చలి విపరీతంగా పెరుగుతోంది. చలికాలం నేపథ్యంలో ఎలక్ట్రానిక్ వస్తువుల విషయంలో జాగ్రత్తలు పాటించాలి. మొబైల్స్ ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను బహిరంగ ప్రదేశాల్లో ఎక్కువసేపు ఉంచవద్దు. దీనికారణంగా ఓవర్ కూల్ కావడంతో పాటు బ్యాటరీ డ్రెయిన్ అవుతుంది. ఎలక్ట్రానిక్ కంపోనెట్స్ తేమ వచ్చి చెడిపోయే అవకాశం ఉంటుంది. ఎలక్ట్రానిక్ వస్తువుల లోపల ఉండే చిప్‌లు మైనస్ టెంపరేచర్‌లో గట్టిపడి పనితీరు మందగిస్తుంది. అదే విధంగా ఎలక్ట్రానిక్ పరికరాలను హీటింగ్ పరికరాలకు దగ్గరగా ఉంచవద్దు. అది మొబైల్స్ పనితీరును ప్రభావితం చేస్తుంది. కీప్యాడ్ మొబైళ్లు కొంత బిగిసుకపోయే అవకాశం ఉంటుంది. మొబైల్ బాగా వేడయితే స్విచ్ఛాఫ్ చేయడం ఉత్తమం. మైనస్ టెంపరేచర్ ఉన్న సందర్భంలో కంప్యూటర్ల బ్యాటరీ, కంట్రాక్టులు సైతం ప్రభావితం అవుతాయి. మంచుకురిసే ప్రాంతాల్లో ఎలక్ట్రానిక్ వస్తువుల వినియోగం చాలావరకు తగ్గించుకోవాలి.

క్లుప్తంగా

క్రీడాకారులను ప్రోత్సహించాలి



మహేందర్‌ను సన్మానిస్తున్న జిల్లా అధికారులు, క్రీడా సంఘాల ప్రతినిధులు

సుల్తానాబాద్: జిల్లా క్రీడాకారులను ప్రోత్సహించి క్రీడల్లో రాణించేలా చూడాలని జిల్లా అదనపు కలెక్టర్ దాసరి వేణు అన్నారు. సీఎం కప్ జిల్లాపోటీలను గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఒలింపిక్ సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా ఎన్నికైన సుల్తానాబాద్ వాసి సిలివేరి మహేందర్‌ను అధికారులు, క్రీడా సంఘాల ప్రతినిధులు సన్మానించారు. ఇంటర్ నోడల్ అధికారి కల్పన, డీఈవో మాధవి, డీవైఎస్‌వో సురేశ్, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి దాసరి రమేశ్, ప్రణవ్, స్పోర్ట్స్ క్లబ్, క్రీడా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

మిత్రుడి కుటుంబానికి చేయూత



ఫిక్స్‌డ్ డిపాజిట్ అందిస్తున్న బాల్యమిత్రులు

కోల్‌సిటీ: గోదావరిఖనిలో పదో తరగతి వరకు కలిసి చదువుకున్న ఓ స్నేహితుడు అకస్మాత్తుగా గుండెపోటుతో మృతి చెందగా తోటి పూర్వ విద్యార్థులు అతడి కుటుంబానికి చేయూత అందించారు. స్థానిక చైతన్య స్కూల్‌లో 1990లో పదో తరగతి వరకు చదువుకున్న పూర్వ విద్యార్థుల్లో దేవ రాజపాపయ్య ఇటీవల గుండెపోటుతో మృతి చెందాడు. స్నేహితుని కుటుంబాన్ని ఆదుకోవడానికి మిత్రులు జనగామ తిరుపతి, తమ్మిశెట్టి సంపత్, కట్ట కుమార్, రాచకొండ కోటేశ్వర్లు మిత్ర బృందం ముందుకొచ్చి రూ.40వేల వరకు సేకరించారు. మిత్రుడి కూతురు పేరు మీద బ్యాంక్‌లో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశారు. గురువారం ఫిక్స్‌డ్ డిపాజిట్‌ను మిత్రుడి భార్య, కూతురికి అందజేశారు.

సమగ్ర శిక్ష ఉద్యోగులకు న్యాయం చేయాలి




శిబిరంలో మాజీ ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి

పెద్దపల్లిరూరల్: రాష్ట్రంలో పనిచేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులకు న్యాయం చేయాలని మాజీ ఎమ్మెల్యే గుజ్జుల రామకృష్ణారెడ్డి డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో సమగ్ర శిక్ష ఉద్యోగులు నిర్వహిస్తున్న దీక్షా శిబిరాన్ని గురువారం ఆయన సందర్శించి సంఘీభావం తెలిపారు. కాంట్రాక్టు ఉద్యోగులందరినీ రెగ్యులర్ చేయాలని, సమాన పనికి తగిన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. బీజేపీ దళితమోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లె సదానందం, మండల అధ్యక్షుడు పర్స సమ్మయ్య, నాయకులు రాంసింగ్, క్రాంతికుమార్, సతీశ్, దిలీప్, పెద్దపల్లి మండల అధ్యక్షుడు సుందరగిరి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరానికి స్పందన

పెద్దపల్లిరూరల్: లయన్స్ క్లబ్ విజన్ కేర్ ఆధ్వర్యంలో గురువారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. విజన్ కేర్ కార్యదర్శి, ఆప్తాల్మిక్ ఆఫీసర్ లయన్, అబ్దుల్ సహకారంతో అత్యాధునిక పరికరాలతో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించామన్నారు. ప్రతీ గురువారం వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షులు, లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ స్క్రీనింగ్ క్యాంప్స్ డిస్ట్రిక్ట్ కమిటీ చైర్మన్ లయన్ పూదరి దత్తాగౌడ్ తెలిపారు. కంటి శస్త్ర చికిత్సలు అవసరమైన వారికి లయన్స్ క్లబ్ ఇంటర్నేషన్ చార్టర్డ్ గవర్నర్, రేకుర్తి కంటి ఆసుపత్రి వైస్ చైర్మన్ లయన్ చిదుర సురేశ్ సహకారంతో లయన్స్ కంటి ఆసుపత్రి రేకుర్తి కరీంనగర్‌లో నిర్వహిస్తామని తెలిపారు.

విజ్ఞానయాత్రలో మోడల్ స్కూల్ విద్యార్థులు



ఓదెల: ఓదెల మోడల్ స్కూలుకు చెందిన విద్యార్థులు గురువారం విజ్ఞానయాత్రకు తరలివెళ్లారు. ఆరరో తరగతి నుంచి పదో తరగతి వరకు 55మంది విద్యార్థులు హైదరాబాద్ ఎడ్యుకేషన్ వైజ్ఞానిక విహారయాత్రకు వెళ్లారు. వండర్‌లా, ట్యాంక్‌బండ్, బిర్లామందిర్ తిలకించారు. ప్రిన్సిపాల్ శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు త్వరగా పూర్తిచేయండి



మాట్లాడుతున్న నగర మేయర్ అనిల్‌కుమార్

కోల్‌సిటీ: నగరంలో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో నాణ్యత లోపించకుండా ప్రత్యేక దృష్టిసారించి, త్వరితగతిన పూర్తి చేయాలని ఇంజనీరింగ్ అధికారులను నగర మేయర్ డాక్టర్ బంగి అనిల్‌కుమార్ ఆదేశించారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో గురువారం అభివృద్ధి పనుల పురోగతిపై మేయర్ ఇంజనీరింగ్ విభాగం అధికారులతో సమీక్షించారు. మేయర్ మాట్లాడుతూ టీయూఎఫ్ఐడీసీ, 15వ ఆర్థిక సంఘం, స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్ నిధులతో టెండర్ పిలిచిన అన్ని పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలన్నారు. ఇటీవల జిల్లా పర్యటనకు సీఎం వచ్చిన క్రమంలో, మంజూరు చేసిన రూ.20కోట్ల నిధులకు సంబంధించిన పనులకు అంచనాలు సిద్ధం చేసి, టెండర్లు పిలిచి పనులు త్వరగా పూర్తి చేయించాలని సూచించారు. లక్ష్మీనగర్, కళ్యాణ్‌నగర్‌లో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా త్వరితగతిన పనులు పూర్తి చేయాలన్నారు. నగరపాలక సంస్థ ఎస్‌ఈ శివానంద్, ఈఈ రామన్, అసిస్టెంట్ కమిషనర్ రాజలింగు, డీఈలు, ఏఈలు, వర్క్ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

సీఎం కప్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



మంథని: క్రీడాకారులతో కొమురోజు శ్రీనివాస్



ఎలిగేడు: ఎంపికైన విద్యార్థినులు

మంథని: సీఎం కప్ పోటీల్లో భాగంగా మంథని జూనియర్ కళాశాల మైదానంలో నిర్వహించిన జిల్లాస్థాయి లాన్ టెన్నిస్ పోటీల్లో సుంకరి జగదీశ్వర్ గోల్డ్ మెడల్‌తో మొదటి స్థానంలో నిలిచినట్లు ఎస్‌జీఎఫ్ జనరల్ సెక్రటరీ కొమురోజు శ్రీనివాస్ తెలిపారు. విజయ్‌కుమార్ రెండో స్థానం, పోలు రామకృష్ణ మూడు, తీగల నరేశ్ నాలుగో, పోతరవేన వినోద్ ఐదోస్థానంలో నిలిచినట్లు పేర్కొన్నారు. ఈనెల 27 నుంచి హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియంలో జరిగే రాష్ట్రస్థాయి లాన్ టెన్నిస్ పోటీల్లో పాల్గొంటారని ఆయన చెప్పారు.

జూలపల్లి: మండల కేంద్రం నుంచి సీఎం కప్ ఆటల పోటీల్లో రాష్ట్రస్థాయికి మండలం నుంచి ముగ్గురు విద్యార్థినులు ఎంపికయ్యారు. సుల్తానాబాద్‌లో నిర్వహించిన కబడ్డీ ఉమెన్స్ ఫైనల్ పోటీల్లో జిల్లా నుంచి ఎలిగేడు ఉన్నత పాఠశాల నుంచి మీనుగు భూలక్ష్మి, దూళికట్ట ఉన్నత పాఠశాల నుంచి భూసారపు వైష్ణవి, సుల్తాన్‌పూర్ ఉన్నత పాఠశాల నుంచి కనుకుంట్ల పూజ ఎంపికయ్యారు. రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థినులను ఎంఈవో నరేంద్రచారి, మండల కాంప్లెక్సు హెచ్‌ఎం దేవేందర్‌రావు, హెచ్‌ఎం సదయ్య, పీడీలు ప్రణయ్, శ్రీను, శ్రీకాంత్ అభినందించారు.

రాష్ట్రస్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీలకు ఎంపిక

గోదావరిఖనిటౌన్: హైదరాబాద్ ఎల్‌బీ స్టేడియంలో ఈ నెల 27 నుంచి నిర్వహించనున్న రాష్ట్రస్థాయి సీఎం కప్ వెయిట్ లిఫ్టింగ్, పవర్ లిఫ్టింగ్ రాష్ట్రస్థాయి పోటీలకు పలువురు ఎంపికయ్యారు. జిల్లా వెయిట్ లిఫ్టింగ్, పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో బాలురు జి.నవీన్, టి.బ్రహ్మ సుధీర్, డి.సాత్విక్, ఇ.విష్ణు, కె.తరుణ్‌కుమార్, పి.వరుణ్ సందేష్, వి.ప్రతీక్, ఎండీ అహ్మద్, బి.యశ్వంత్ ఎంపికయ్యారు. బాలికల విభాగంలో పి.లక్ష్మిబిందు, ఎం.అముక్త మల్లదా, సీహెచ్ శరణ్య, పి.శశిరేఖ, కె.అశ్రిత, జీనత్ తబస్సుమ్, ఇ.పౌర్ణమి, తేజశ్రీ ఎంపికైనట్లు అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు గాండ్ల రాజు, శారద, కార్యదర్శి శ్రీనివాస్ పేర్కొన్నారు.

సంక్షిప్త వార్తలు

• అమిత్‌షా రాజీనామా చేయాలి

గోదావరిఖని: పార్లమెంట్ సాక్షిగా అంబేడ్కర్‌ను అవమానపరిచేలా మాట్లాడిన కేంద్ర హోంశాఖమంత్రి అమిత్‌షా రాజీనామా చేయాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదురుగా గల అంబేడ్కర్ విగ్రహానికి గురువారం పూలమాల వేసి నివాళి అర్పించారు.

• ప్రజలకు మార్గదర్శి అంబేడ్కర్

పెద్దపల్లిరూరల్: దేశ ప్రజలకు మార్గదర్శిగా నిలిచిన డాక్టర్ అంబేడ్కర్ అందరికీ ఆరాధ్యుడని కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి కల్లెపల్లి అశోక్ అన్నారు. పార్లమెంట్‌లో గురువారం రాజ్యాంగ నిర్మాత డాక్టర్ అంబేడ్కర్‌ను కించపరిచేలా కేంద్ర మంత్రి అమిత్‌షా మాట్లాడిన తీరును నిరసిస్తూ కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం ఆధ్వర్యంలో బస్టాండ్ సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహం దగ్గర అమిత్‌షా దిష్టిబొమ్మ దహనం చేశారు.

• అంబేడ్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం

మంథని: బీఆర్ అంబేడ్కర్‌ను అవమాన పరిచేలా మాట్లాడిన కేంద్ర మంత్రి అమిత్ షాను మంత్రి పదవి నుంచి భర్తరఫ్ చేయాలని ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం మంథనిలోని అంబేడ్కర్ విగ్రహానికి ప్రజా సంఘాల నాయకులు క్షీరాభిషేకం చేశారు.

• నేడు డయల్ యువర్ డీఎం

మంథని: మంథని ఆర్టీసీ డిపో పరిధిలో శుక్రవారం డయల్ యువర్ డీఎం నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ శ్రావణ్‌కుమార్ తెలిపారు. ప్రయాణికులు తమ సమస్యలు, సలహాలు, సూచనలు 73828 25923 నంబర్‌కు అందించాలన్నారు.

గోదావరిఖనిటౌన్: ప్రయాణికుల సమస్యలు, సలహాలు స్వీకరించేందుకు శుక్రవారం ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 12వరకు డయల్ యువర్ డీఎం ప్రోగ్రాం నిర్వహించనున్నట్లు గోదావరిఖని డీఎం ఎం.నాగభూషణం తెలిపారు. ప్రయాణీకులు తమ సలహాలు, సూచనలు 99592 25922 నంబర్‌కు ఫోన్ చేసి తెలపాలని కోరారు.

• ఉపాధ్యాయుడిపై చర్యలు తీసుకోవాలి

పెద్దపల్లిరూరల్: ఓదెల మండలం జీలకుంట ప్రాథమిక పాఠశాలలో ఎస్‌జీటీగా విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయుడు సివిల్ తగాదాల్లో జోక్యం చేసుకున్న క్రమంలో అతడిపై చర్యలు తీసుకోవాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి ప్రశాంత్ గురువారం డీఈవో మాధవికి వినతిపత్రం అందించాడు.

• సమ్మెకు సీఐటీయూ మద్దతు

పెద్దపల్లిరూరల్: సమగ్ర శిక్ష ఉద్యోగుల సమ్మెకు సీఐటీయూ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు జిల్లా కార్యదర్శి ఎరవెల్లి ముత్యంరావు తెలిపారు. గురువారం జిల్లా కేంద్రంలో సమగ్ర శిక్ష ఉద్యోగుల దీక్షా శిబిరాన్ని సందర్శించి వారికి మద్దతు తెలిపారు.

• కబ్జా భూములను కాపాడాలి

ముత్తారం: మండలంలోని సీతంపేట, ఓడెడ్, పోతారంలో ప్రభుత్వ భూములు కబ్జాకు గురవుతున్నాయని గురువారం తహసీల్దార్ సుమన్‌కు బీఆర్‌ఎస్ నాయకులు వినతిపత్రం అందజేశారు.

• పంచాయతీ కార్మికుల నిరసన

రామగుండం: తమ సమస్యలు పరిష్కారానికి నోచుకోలేదని నిరసిస్తూ గురువారం పంచాయతీ కార్మికులు అంతర్గాం మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి ముత్యంరావు, పంచాయతీ యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ తూడూరి శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

జూలపల్లి: గ్రామ పంచాయతీ సిబ్బందిని క్రమబద్ధీకరించి జీవో51ను సవరించాలని గురువారం సిబ్బంది నిరసన చేశారు. 27, 28వ తేదీల్లో రెండు రోజుల పాటు టోకెన్ సమ్మె చేయనున్నట్లు సంఘం జిల్లా అధ్యక్షుడు సీపెల్లి రవీందర్ వివరించారు.

• సమస్యలు పరిష్కరించాలి

పెద్దపల్లిరూరల్: మోడల్ స్కూల్ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని పీఎంటీఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అనుముల పోచయ్య, జిల్లా అధ్యక్షుడు ఆకుల రమేశ్ గురువారం అడిషనల్ కలెక్టర్ అరుణశ్రీకి వినతిపత్రం అందజేశారు.

• పారిశుద్ధ్య కార్మికులకు దుప్పట్ల పంపిణీ

ధర్మారం: మండల కేంద్రానికి చెందిన పంచాయతీ కార్మికులకు లయన్స్‌క్లబ్ ఆఫ్ ధర్మారం అధ్యక్షుడు రవీందర్‌శెట్టి ఆధ్వర్యంలో దుప్పట్లు పంపిణీ చేశారు. క్లబ్ రీజనల్ చైర్మన్ రాజేందర్, జోన్ చైర్మన్ శ్రీనివాస్, డిస్ట్రిక్ట్ చీఫ్ కోఆర్డినేటర్ ఎల్లారెడ్డి, ట్రెజరరీ రమేశ్, వైస్ ప్రెసిడెంట్ మల్లేశం పాల్గొన్నారు.

• ఇందిరమ్మ ఇళ్ల సర్వే పరిశీలన

పెద్దపల్లిరూరల్: ఇందిరమ్మ ఇళ్ల సర్వేను ఎంపీడీవో శ్రీనివాస్ పరిశీలించారు. పెద్దపల్లి మండలం రాఘవపూర్ గ్రామంలో జరుగుతున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వేను గురువారం ఆయన పరిశీలించారు. సర్వేను పకడ్బందీగా చేయాలని సిబ్బందిని ఆదేశించారు.

యైటింక్లయిన్‌కాలనీ: రామగిరి మండలం ముస్త్యాల, జల్లారం, చందనాపూర్ గ్రామాల్లో నిర్వహిస్తున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వేను డీఎల్‌పీవో సతీశ్‌కుమార్ గురువారం ఆకస్మికంగా పరిశీలించారు.

జెడ్పీ సీఈవో పర్యటన

జూలపల్లి: ఎంపీడీవో కార్యాయాన్ని జెడ్పీ సీఈవో నరేందర్ గురువారం సందర్శించారు. అనంతరం జూలపల్లిలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులతో మాట్లాడారు. సీఈవో వెంట ఎంపీడీవో పద్మజ, ఎంపీవో అనిల్‌రెడ్డి ఉన్నారు. వడ్కాపూర్, కాచాపూర్ గ్రామాలల్లో ఎంపీడీవో, ఎంపీవో, ఏపీవో సదానందం పర్యటించారు. సర్వే తీరును పరిశీలించారు.

కుటుంబ బంధాలపై అవగాహన కల్పించాలి



వెల్‌బేబీ షోలో పాల్గొన్న జీఎం వెంకటయ్య

గోదావరిఖని: కుటుంబ బంధాలపై పిల్లలకు అవగాహన కల్పించాలని ఆర్జీ–2 జీఎం బి.వెంకటయ్య అన్నారు. యైటింక్లయిన్‌కాలనీ డిస్పెన్సరీలో గురువారం నిర్వహించిన వెల్ బేబీషోకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. చిన్నతనం నుంచే కుటుంబ బంధాలపై అవగాహన కల్పించాలని, క్రమశిక్షణతో, మంచి ఆరోగ్య అలవాట్లు నేర్పించాలన్నారు. ఏఐటీయూసీ నాయకులు జీగురు రవీందర్, ఎస్‌వోటూ జీఎం రాముడు, అధికార ప్రతినిధి అనిల్‌కుమార్, మెడికల్ సూరింటెండెంట్ డాక్టర్ మహిపాల్, పర్యావరణ అధికారి వేణు, డాక్టర్ పద్మ, డాక్టర్ సాహితి పాల్గొన్నారు.

అయ్యప్ప ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలి



మాట్లాడుతున్న కోరుకంటి చందర్

గోదావరిఖనిటౌన్: అయ్యప్ప ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని రామగుండం మాజీ ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్ ఆకాంక్షించారు. శ్రీధర్మశాస్త్ర నిత్యాన్నదాన వేదిక వార్షికోత్సవం సందర్భంగా స్థానిక పోచమ్మ ఆలయంలో అయ్యప్ప పడిపూజ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. శ్రీధర్మశాస్త్ర నిత్యాన్నదాన నిర్వాహకులు కొటం బాబు 41రోజుల పాటు పోచమ్మ ఆలయంలో అన్న వితరణ కార్యక్రమం ఏర్పాటు చేయడం సంతోషకరమన్నారు. కార్పొరేటర్లు పాముకుంట్ల భాస్కర్, కల్వచర్ల కృష్ణవేణి, గాధం విజయ, నాయకులు నారాయణదాసు మారుతి, రవి, శ్రీనివాస్, మహేందర్, వెంకన్న, సంధ్యారెడ్డి, వెంకటేశ్ పాల్గొన్నారు.

పంచాయితీ పరిష్కరించాలని సెల్‌టవర్ ఎక్కిన వ్యక్తి



టవరెక్కిన మల్లేశ్

కాల్వశ్రీరాంపూర్: అన్నదమ్ముల మధ్య దారి పంచాయితీ పరిష్కరించాలని మండలంలోని పందిల్ల కు చెందిన కొండపర్తి మల్లేశ్ గురువారం సెల్ టవరెక్కాడు. ఎస్సై వెంకటేశ్ తెలిపిన వివరాల ప్రకారం కొంతకాలంగా ఇంటి ముందు దారికోసం గ్రామానికి చెందిన అన్నదమ్ములు కొండపర్తి కొమురయ్య మల్లేశ్ మధ్య వివాదం కొనసాగుతోంది. పోలీసులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోవడంతో మల్లేశ్ సెల్‌టవర్ ఎక్కాడు. సమాచారం అందుకున్న ఎస్సై గ్రామానికి వెళ్లి మల్లేశ్‌కు నచ్చజెప్పి కిందకు దించారు. మల్లేశ్ సెల్ టవరెక్కిన సంఘటనపై పెద్దపల్లి ఏసీపీ గజ్జి కృష్ణ ఆరా తీసినట్లు పోలీసులు తెలిపారు.

స్వర్ణకారుల సంఘం అధ్యక్షుడిగా తిరుపతి

ధర్మారం: ధర్మారం స్వర్ణకారుల సంఘం అధ్యక్షుడిగా మోటపెల్లి తిరుపతి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మండల కేంద్రంలోని స్వర్ణకారుల సంఘం భవనంలో గురువారం సమావేశం నిర్వహించారు. ఎన్నికలు నిర్వహించగా అధ్యక్షుడిగా తిరుపతి, ప్రధాన కార్యదర్శిగా పూసాల శ్రీధర్ నామినేషన్ వేయగా ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు జిల్లా స్వర్ణకారుల సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి రంగు శ్రీనివాస్, శ్రీరామోజు రాజు ప్రకటించారు.

సింగరేణి వార్తలు

సింగరేణి వేడుకల ఏర్పాట్లు పరిశీలన



ఏర్పాట్లను పరిశీలిస్తున్న జీఎం వెంకటయ్య

గోదావరిఖని: సింగరేణి ఆవిర్భావ వేడుకల ఏర్పాట్లను ఆర్జీ–2 జీఎం బండి వెంకటయ్య గురువారం పరిశీలించారు. యైటింక్లయిన్‌కాలనీ అబ్దుల్‌కలాం స్టేడియంలో సింగరేణి దినోత్సవం వేడుకలను ఘనంగా నిర్వహించేలా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. హాజరయ్యే ఉద్యోగులకు, వారి కుటుంబ సభ్యులు, సన్మాన గ్రహీతలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఎస్‌వోటూ జీఎం రాముడు, ప్రాజెక్టు అధికారి ఎస్.మధుసూదన్, అధికార ప్రతినిధి ఎస్.అనిల్‌కుమార్, వర్క్‌షాప్ డీజీఎం ఎర్రన్న, సివిల్ డీజీఎం ధనుంజయ, సివిల్ జేఈ రాధాకృష్ణ పాల్గొన్నారు.

లేడీస్ క్లబ్ మహిళలకు ఆటల పోటీలు



పోటీలను ప్రారంభిస్తున్న ఎస్‌వోటూ జీఎం రఘుపతి

రామగిరి: సింగరేణి ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం సెంటినరికాలనీ సీఎస్‌సీవోఏ క్లబ్‌లో మహిళలకు ఆటలపోటీలు నిర్వహించారు. ఈ పోటీలను లేడీస్ క్లబ్ అధ్యక్షురాలు నరేంద్ర అలివేణి, కొప్పుల విజయలక్ష్మి గురువారం ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఈ పోటీల్లో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొనడం చాలా సంతోషకరమని, ఇలాంటి పోటీలను సింగరేణి సంస్థ కొద్దికాలంగా నిర్వహిస్తోందన్నారు. విజేతలకు సెంటినరికాలనీ రాణిరుద్రమ దేవి క్రీడా ప్రాంగణంలో 23న సాయంత్రం 6గంటలకు నిర్వహించనున్న సింగరేణి వేడుకల్లో బహుమతులు అందజేస్తామని పేర్కొన్నారు. లేడీస్ క్లబ్ కమిటీ సభ్యులు కోమలి, ప్రసన్న, లావణ్య, సేవా కోఆర్డినేటర్ సుధాకర్, నిర్వహకులు నాగరాజు పాల్గొన్నారు.

జీఎం కార్యాలయంలో..

సింగరేణి ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం జీఎం కార్యాలయంలో ఆర్జీ–3, ఏపీఏలోని ఆయా విభాగాలు, గనుల్లో విధులు నిర్వహిస్తున్న మహిళా ఉద్యోగులకు ఆటలపోటీలు ఎస్‌వోటూ జీఎం జి.రఘుపతి ప్రారంభించారు. ఏరియా సేఫ్టీ అధికారి ఎం.రామ్మోహన్, పర్సనల్ విభాగాధిపతి బి.సుదర్శనం, డీపీఎం గుర్రం శ్రీహరి, సేవా కోఆర్డినేటర్ సుధాకర్, నిర్వాహకులు నరసింహారెడ్డి, నాగరాజు, రవి పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం సద్వినియోగం చేసుకోవాలి

గోదావరిఖని: సింగరేణి ప్రభావిత గ్రామమైన 19వ డివిజన్ న్యూమారేడుపాక గ్రామంలో ఈనెల 21న నిర్వహించే ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆర్జీ–2 జీఎం బండి వెంకటయ్య కోరారు. ఆర్జీ–2 ఏరియా వకీల్‌పల్లి గనికి సంబంధించి జరిగిన ప్రజాభిప్రాయ సేకరణలో భాగంగా వచ్చిన అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ప్రభావిత గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా సింగరేణి ముందుకు సాగుతోందన్నారు. గతంలో కూడా ప్రభావిత గ్రామాల అభివృద్ధి కోసం అనేక కార్యక్రమాలు చేపట్టామన్నారు. ఈ శిబిరంలో నిష్ణాతులైన సింగరేణి వైద్యులతో పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేయనున్నట్లు తెలిపారు.

జీజీహెచ్‌లో ఉచిత అల్పాహారం పంపిణీ

కోల్‌సిటీ: గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి(జీజీహెచ్)లో రోగుల వెంట ఉండే సహాయకులకు గురువారం సత్యసాయి సేవాసమితి ప్రతినిధులు అల్పాహారం పంపిణీ చేశారు. సేవాసమితి కోఆర్డినేటర్ నూక రమేశ్ మాట్లాడుతూ ప్రతినెలా 19న ఉచితంగా అల్పాహారం పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. అలాగే ప్రతి నెలా మొదటి ఆదివారం నిరుపేదల ఇంటికి వెళ్లి నిత్యావసర సరుకులు అందజేస్తున్నట్లు పేర్కొన్నారు. సేవాసమితి ప్రతినిధులు పి.మల్లయ్య, లక్ష్మీనారాయణ, భాస్కర్, టి.శ్రీనివాస్, బుగ్గాజి పాల్గొన్నారు.



ఎలిగేడు: మండలంలోని ధూళికట్ట గ్రామంలోని ఊర చెరువు కట్ట కిందనున్న రెండు రక్షిత మంచినీటి బావులు ప్రమాదకరంగా మారాయి. బావుల పక్కన డబుల్ రోడ్డు నిర్మించారు. రోడ్డుకు సమానంగా బావులుండటంతో రోడ్డు వెంట వెళ్లే వాహనదారులు, చుట్టుపక్కలున్న చిన్నారులకు ప్రమాదకరంగా ఉండటంతో గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. ప్రమాదం జరిగితేనే అధికారులు స్పందిస్తారా అని ప్రశ్నిస్తున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
భాస్కరరావు, ఎంపీడీవో, గ్రామ ప్రత్యేక అధికారి, సెల్ నం.: 9281486900

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటినుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 97053 46608, 98499 71500

దుర్గామాత ఆలయంలో ప్రత్యేక పూజలు

గోదావరిఖని: ఆర్జీ–1 ఏరియాలోని జీడీకే–1, 3 గనిలోని దుర్గామాత ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా చండీ హోమం జరిపారు. అనంతరం అన్నదానం చేశారు. ఆర్జీ–1 జీఎం లలిత్‌కుమార్ హాజరై అన్నదానంలో పాల్గొన్నారు. గ్రూప్ ఏజెంట్ రమేశ్, దాసరి వెంకటేశ్వర్‌రావు, చంద్రశేఖర్, నాగేశ్వర్‌రావు, చిలక శ్రీనివాస్, ఏఐటీయూసీ నాయకులు స్వామి, మద్దిఎల్లయ్య, ఆరెల్లి పోషం, డీజీఎం పర్సనల్ కిరణ్‌బాబు, మేనేజర్ రమేశ్, పర్సనల్ అధికారులు రవీందర్‌రెడ్డి, సారంగపాణి, హనుమంతరావు, శ్రవణ్‌కుమార్, ఇక్బాల్ షరీఫ్ పాల్గొన్నారు.

క్రమశిక్షణతోనే బంగారు భవిష్యత్

కాల్వశ్రీరాంపూర్: క్రమ శిక్షణతోనే విద్యార్థులకు బంగారు భవిష్యత్ ఉంటుందని ఎస్సై వెంకటేశ్ అన్నారు. మండల కేంద్రంలోని మాజీ ఎమ్మెల్యే దివంగత నేత కాల్వ లీలావతి రాంచంద్రా రెడ్డి నిలయంలో నిర్వహిస్తున్న వేదవ్యాస హైస్కూల్ విద్యార్థులు గురువారం స్థానిక పోలీస్‌స్టేషన్ ఫీల్డ్ విజిట్ చేశారు.